సాక్షి ఖమ్మం

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025

I



ఆయిల్‌ఫెడ్ అదుర్స్ !
ఆయిల్‌పామ్ గెలల సేకరణ, ఈఓఆర్ నమోదులో ఆయిల్‌ఫెడ్ ముందుగానే లక్ష్యసాధనకు చేరువైంది. IIలో



నేటి నుంచి టీ.టీ. టోర్నీ
ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 22°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ కాస్త పెరిగే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

వైరా/ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. వైరాలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు తదితరులు కాంగ్రెస్‌లో చేరనుండగా ఆ సమావేశంలో భట్టి పాల్గొంటారు. ఆ తర్వాత చింతకానిలో జరగనున్న కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం హాజరవుతారు.

పశువైద్య శాఖకు ఆర్టీఐ అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: అడిగిన సమాచారం అందించడంతో ముందు వరుసలో నిలిచిన జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ తెలంగాణ సమాచార కమిషన్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది విభాగాల్లో సమాచార హక్కు కమిషన్ 'ఆర్టీఐ వీక్–2025' అవార్డులు ప్రకటించింది. ఈమేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.


23వరకు స్కావెంజర్లపై అభ్యంతరాల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: మ్యానువల్ స్కావెంజర్లపై ఈనెల 23వరకు అభ్యంతరాలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇటీవల నిర్వహించిన సర్వేలో మ్యానువల్ స్కావెంజర్లు లేరని గుర్తించామని తెలిపారు. ఈ అంశంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 23న సాయంత్రం 5గంటల్లోగా కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. గడువులోగా అభ్యంతరాలు రాకపోతే జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్లు లేనట్లుగా ప్రకటిస్తామని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

పొద్దంతా టెన్షన్.. టెన్షన్

బీసీ రిజర్వేషన్లపై స్టేతో నిలిచిన ఎన్నికల ప్రక్రియ

- 'స్థానిక' బరిలోకి దిగాలనే ఆశావహుల్లో నిస్పృహ
- మళ్లీ ఎన్నికలు ఎప్పుడు ఉంటాయో తెలియక సందిగ్ధత
- పరిషత్ ఎన్నికలకు జిల్లాలో ఏడు నామినేషన్లు





స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో ఎన్నికల్లో బరిలో నిలుద్దామనుకున్న ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న అంశంపై స్పష్టత రాలేదు. దీంతో ఉదయం నుంచి కోర్టు తీర్పు కోసం ఎదురుచూసిన పార్టీల నాయకులు, ఆశావహులు సాయంత్రం నిరాశకు లోనయ్యారు. జిల్లాలో మొదటి విడతగా పది మండలాల్లో ఎన్నికల షెడ్యూల్ గురువారం జారీ చేసినా, కోర్టులో వాదనలు ఉండడంతో ఆశావహులంతా అటే దృష్టి సారించి నామినేషన్ల దాఖలుపై ఆసక్తి కనబర్చలేదు. ఫలితంగా జిల్లాలో పది జెడ్పీటీసీలకు గాను రెండు, 149 ఎంపీటీసీ స్థానాలకు ఐదే నామినేషన్లు దాఖలయ్యాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

నోటిఫికేషన్ విడుదల

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీఓపై గురువారం హైకోర్టులో వాదనలు ఉండగా.. నోటిఫికేషన్ జారీకి అనుమతిచ్చింది. దీంతో అధికారులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు నామినేషన్ల స్వీకరణ మొదలుపెట్టారు. జిల్లాలో మొదటి విడతగా పది జెడ్పీటీసీ, 149 ఎంపీటీసీ స్థానాలకు ఈనెల 11వరకు నామినేషన్లు స్వీకరించి 23న పోలింగ్ నిర్వహించేలా నోటిఫికేషన్ విడుదల చేశారు. కానీ కోర్టు సాయంత్రం జారీ చేసిన స్టేతో ప్రక్రియకు బ్రేక్ పడినట్లయింది.

సిద్ధమైన ఆశావహులు

ఎన్నికల్లో పోటీ చేసేలా కొద్దినెలలుగా ఆశావహులు సమాయత్తమవుతున్నారు. పార్టీలో మద్దతు కూడగట్టుకోవడం, నామినేషన్ పత్రాల తయారీ, పోటీ స్థానం ఎంపికపై కసరత్తు చేస్తున్న వారు నోటిఫికేషన్ జారీతో మరింత అప్రమత్తమయ్యారు. నామినేషన్లకు రెండు రోజుల గడువే ఉండడంతో పార్టీల్లోనూ హడావుడి ప్రారంభమైందింది. ఇంతలోనే ఎన్నికలు వాయిదా పడడం గ్రామ, మండల స్థాయిలో పట్టు నిరూపించుకోవాలని ఉవ్విళ్లూరుతున్న వారికి నిరాశ కలిగించింది. ఏడాదిన్నరగా జీపీలకు పాలకవర్గాలు లేవు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలూ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల



బోనకల్‌లో నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉన్న అధికారులు

షెడ్యూల్ రావడంతో పోటీకి సిద్ధమైన వారు తమ గెలుపు ఖాయమని భావిస్తుండగా వాయిదాతో అసంతృప్తికి గురయ్యారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులకు నిరాశే మిగిలినట్లయింది.

బోణీ అంతంతే...

నోటిఫికేషన్ విడుదలైన గురువారం జిల్లాలో రెండు జెడ్పీటీసీ స్థానాలకు, ఐదు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. కూసుమంచి, ముదిగొండ జెడ్పీటీసీ స్థానాలకు ఒక్కో నామినేషన్ అందాయి. ఇక ఎంపీటీసీ స్థానాల్లో కూసుమంచి, చేగొమ్మ నుంచి ఒక్కొక్కటి చొప్పున కాంగ్రెస్ అభ్యర్థులు, చింతకాని మండలం రామకృష్ణాపురం స్థానానికి ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు, ముదిగొండ మండలం చిరుమర్రి స్థానానికి సీపీఎం అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.

ఎక్కడికక్కడే బ్రేక్

మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన రోజే ఆగిపోవడం గమనార్హం. బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంతో అధికారులు ప్రక్రియను నిలిపివేశారు. నామినేషన్ల స్వీకరణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయగా, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎన్నికల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటుచేసిన కార్యాలయాలను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఆర్డీఓలు పరిశీలించారు. ఇక స్వీకరణ కార్యాలయాల వద్ద పోలీసుల బందోబస్తు కూడా ఏర్పాటుచేశారు.

మళ్లీ ఎప్పుడు?

బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కోర్టు నాలుగు వారాల స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడగా మళ్లీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత రాలేదు. గత ఎన్నికల రిజర్వేషన్లనే మరోసారి అమలుచేస్తారని చర్చ జరుగుతోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తో ఈ ఎన్నికల్లో వారికి అత్యధిక స్థానాలు దక్కే అవకాశం ఏర్పడింది. దీంతో పోటీకి దిగి సత్తా నిరూపించుకోవాలని బీసీ నేతలు సిద్ధమయ్యారు. కానీ తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి తీర్పు వస్తుందో తెలియకపోగా, పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే మాత్రం బీసీల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఒకవేళ గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లు ఆమోదం పొందితే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. ఈమేరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఆర్‌ఓ కార్యాలయాల్లో పరిశీలన

తిరుమలాయపాలెం/కామేపల్లి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు తిరుమలాయపాలెం, కామేపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటుచేశారు. ఈమేరకు కార్యాలయాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కామేపల్లి మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.



కామేపల్లి : అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సీఎం, డిప్యూటీ సీఎంతో మంత్రి తుమ్మల భేటీ

సీతారామ ప్రాజెక్టు, ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చర్చ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తుమ్మల సమర్పించిన ప్రతిపాదనలకు సీఎం, డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. జాతీయ రహదారి పనుల పురోగతి, కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో నిర్మాణాలు, భద్రాచలంలో కరకట్ట విస్తరణ, గ్రామీణ రహదారులు, సీటిపారుదల, విద్యుత్, భూసేకరణ సంబంధిత అంశాలపై చర్చించారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు భూసేకరణ విషయంలో ఎదురవుతున్న అడ్డంకులు, పెండింగ్ బిల్లుల అంశాన్ని వివరించిన తుమ్మల.. సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశించాలని కోరారు. కాగా, ఖమ్మం–దేవరపల్లి, అమరావతి–నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేల భూసేకరణకు అడ్డంకులు తొలగించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు.

ఎర్త్ సైన్సెస్ భవనాలకు ప్రతిపాదనలు

కొత్తగూడెంలో ఏర్పాటైన ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నూతన భవనాల నిర్మాణానికి రూ.వేయి కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే, భద్రాచలంలో కరకట్ట విస్తరణ పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లిన తుమ్మల నాగేశ్వరరావు తగిన నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సమర్పించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా పరిశీలకుడు కృష్ణఆదిత్య



మాట్లాడుతున్న కృష్ణఆదిత్య, పక్కన కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా పరిశీలకులు కృష్ణ ఆదిత్య సూచించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ఆయన గురువారం ఖమ్మం రాగా, కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసుల నమోదు, రీ పోలింగ్ జరిగిన వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని, పోలింగ్ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా చూడాలని చెప్పారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ, బందోబస్తు, బృందాల నియామకంపై సూచనలు చేశారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌ఓ ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, వివిధ శాఖల అధికారులు వెంకటరమణ, ఏ.శ్రీనివాస్, శ్రీరామ్, సునీల్‌రెడ్డి, గంగాధర్, రాజేశ్వరి, జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానగరాలకు దీటుగా ఖమ్మం అభివృద్ధి

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- కేఎంసీ అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ వంటి మహానగరాలకు దీటుగా ఖమ్మంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులు, రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు, సుందరీకరణపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో దెబ్బతిన్న ప్రతీ రోడ్డుకు నెలన్నరలోగా ప్యాచ్‌వర్క్ చేపట్టాలని తెలిపారు. అయితే, గుంత పూడ్చినట్లు కాకుండా జాతీయ రహదారుల అధికారుల నుంచి సూచనలు తీసుకుని పనులు చేయాలని సూచించారు. అంతేకాక నగర పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులను కేఎంసీ ద్వారానే చేపట్టాలని తెలిపారు. అంతేకాక సెంటర్ డివైడర్లు, సర్కిళ్లలో రంగులు వేయడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్న చోట్ల బోర్డులు పెట్టాలని సూచించారు. అభివృద్ధి, మరమ్మతు పనుల్లో నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడైనా లోపాలు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆతర్వాత నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీసిన కలెక్టర్ సూచనలు చేశారు. మున్సిపల్ ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లు చెప్పిందే వేదం!

- రవాణా శాఖ కార్యాలయంలో అంతా వారే..
- ఏడాదిగా భర్తీకి నోచుకోని డీటీఓ పోస్టు
- ఫలితంగా అస్తవ్యస్తంగా కార్యాలయ నిర్వహణ



ఖమ్మంలోని జిల్లా రవాణాశాఖా కార్యాలయం

ఖమ్మంక్రైం: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్లదే హవా నడుస్తోంది. వారు చెప్పిందే వేదం, చేసిందే శాసనం అన్న చందంగా పరిస్థితులు మారాయనే విమర్శలు వస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఏదైనా ఫైల్‌ను పరిశీలించి అనుమతి జారీ చేయాల్సింది ఉద్యోగులే అయినా... అంతా ఏజెంట్ల కనుసన్నల్లోనే నడుస్తోంది. వాహనదారులు నేరుగా వెళ్తే ఏ పనీ జరకగపోగా.. ఏజెంట్లు తమ 'మార్క్'తో పంపించే ఫైల్ మాత్రం చకచకా అన్ని సెక్షన్లు దాటుకుని బయటకు వస్తోందని చెబుతున్నారు. ఏళ్లుగా పాతుకుపోయిన ఏజెంట్ల వ్యవస్థ.. ఉద్యోగుల అక్రమార్జన వెరసి జిల్లా రవాణా శాఖ కార్యాలయం అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి.

వందలాది మంది వాహనదారులు

జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని రవాణా శాఖా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వందలాది వాహనదారులు వస్తుంటారు. లెర్నింగ్ లైసెన్స్‌లు 100–120, పర్మనెంట్ లైసెన్సులు 50–60 వరకు, వాహనాల రిజిస్ట్రేషన్లు యాభైకి పైగా జరుగుతుండగా.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరాల కోసం వాహనదారులు వస్తారు. ఖమ్మంతో పాటు వైరా, సత్తుపల్లి లో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నా ఎక్కడా కూడా నేరుగా సేవలు పొందే పరిస్థితి లేదు. ఏ పనికైనా ఏజెంట్లను కలిస్తే తప్ప అడుగు ముందుకు పడదని తెలుస్తోంది. ఫైల్‌పై కోడ్ ఉంటేనే చకచకా పనులు చేసే ఉద్యోగులు.. నేరుగా వచ్చేవారిని మాత్రం వెనక్కి పంపడం సర్వసాధారణమైందని సమాచారం.

పోస్టు భర్తీ ఎప్పుడు?

జిల్లా రవాణా శాఖాధికారి పోస్టు ఏడాదిగా భర్తీకి నోచుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు కూడా కీలకమైన ఈ పోస్టు ఖాళీగా లేకపోగా.. ఇప్పుడు భర్తీ చేయకపోవడంతో కార్యాలయ నిర్వహణ గాడి తప్పిందని తెలుస్తోంది. ఉద్యోగులు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తుండడాన్ని ఏజెంట్లు తమకు అనువుగా మార్చుకున్నారని చెబుతున్నారు. ఇటీవల ఓ సీనియర్ సిటిజన్ కార్యాలయానికి రాగా ఏజెంట్ల తీరుపై అధికారికి ఫిర్యాదు చేస్తే వచ్చిన సమాధానంతో ఆయన నివ్వెరపోయినట్లు సమాచారం. 'అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఏజెంట్లు ఉన్నారు.. అయినా మా శాఖే కనిపిస్తోందా' అని ఎదురుప్రశ్న వేయడంతో సదరు వ్యక్తి చేసేదేం లేక అడిగినంత డబ్బు చెల్లించి ఏజెంట్ ద్వారా పని చేయించుకున్నట్లు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రవాణా శాఖలో ఏజెంట్ల దందాను అరికట్టడమే కాక డీటీఓ పోస్టు భర్తీ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్యాలయంలోనే ఘర్షణ

ఖమ్మం రవాణా శాఖ కార్యాలయం ఆధారంగా ప్రస్తుతం 150మందికి పైగా ఏజెంట్లు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాహనదారులకు ఏ పనైనా సరే తగినంత నగదు చెల్లిస్తే చేసి పెట్టే వారు.. కార్యాలయ అవసరాల్లోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ఉద్యోగులకు మంచినీళ్ల బాటిళ్లు కూడా ఏజెంట్లే సమకూరుస్తుండడం గమనార్హం. దీనికితోడు కార్యాలయంలో కీలక అధికారులు ముగ్గురేసి అసిస్టెంట్లను నియమించుకుని.. వారి ద్వారా ఏజెంట్లకు సూచనలు చేయడం, చేసిన పనికి డబ్బు వసూలు చేసే బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. కాగా, కొందరు ఏజెంట్ల మధ్య ఇటీవల వివాదాలు మొదలైనట్లు తెలిసింది. కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి బంధువుగా చెప్పే ఏజెంట్ కార్యాలయంపై అధిపత్యం చెలాయిస్తున్నట్లు చెబుతున్నారు. ఆయన తీసుకొచ్చిన ఫైళ్లను చకచకా ఆమోదించుకుని, మిగతా ఏజెంట్ల ఫైళ్లను ఆపివేయిస్తున్నట్లు సమాచారం. దీంతో మిగతా ఏజెంట్లు రవాణా శాఖ ఉద్యోగులపై తిరగబడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలోనే ఇటీవల ఓ అధికారి ముందు ఇద్దరు ఏజెంట్లు దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఇద్దరి మధ్య సమన్వయం కుదర్చడానికి సదరు అధికారి ఖమ్మం బైపాస్‌రోడ్డులోని హోటల్‌కు తీసుకెళ్లగా అక్కడ గొడవ పెరగడంతో సదరు అధికారి జారుకున్నట్లు సమాచారం.

సంద్ర కలప ఎక్కడిది?

- మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో అటవీశాఖ విచారణ
- స్మగ్లర్ మొబైల్ డేటా ఆధారంగా ప్రాథమిక ఆధారాల గుర్తింపు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరాది రాష్ట్రాలకు అక్రమంగా తరలించిన సంద్ర కలప ఎక్కడి నుంచి సేకరించారనే అంశంపై రాష్ట్ర అటవీ శాఖ దృష్టి సారించింది. ఖమ్మం జిల్లా చింతకాని అటవీ సెక్షన్ నుంచి తరలిస్తున్నట్లు నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీఎస్)లో అనుమతి తీసుకున్నా ఆ తర్వాత పర్మిట్‌ను ట్యాంపర్ చేసినట్లు గుర్తించారు. ఈమేరకు సర్కారీ తుమ్మ కలప మాటున సంద్ర కలపను మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లోని పాన్ మసాలా ఫ్యాక్టరీలకు తరలిస్తూ ఇటీవల పట్టుబడిన విషయం విదితమే. అయితే, చింతకాని సెక్షన్ పరిధిలో సంద్ర కలప లేదని ఖమ్మం డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ ఇచ్చిన నివేదికతో ప్రత్యేక అధికారుల బృందాన్ని విచారణకు నియమించారు. విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కూడిన ఈ బృందం మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పరిశీలన మొదలుపెట్టింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో అటవీ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్మగ్లర్లను విచారించగా, ఇద్దరు ఉద్యోగులకు సస్పెండ్ చేశారు. అలాగే, స్మగ్లింగ్‌లో కీలకమైన వ్యక్తి సూర్యాపేట జిల్లా వాసి కావడంతో సంద్ర కలపను మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా, డోర్నకల్ నుంచి సేకరించినట్లు గుర్తించారని సమాచారం. స్మగ్లర్ మొబైల్ డేటా ఆధారంగా ఇప్పటికే కొంత సమాచారం సేకరించిన విజిలెన్స్ అధికారులు సంద్ర కలప నరికివేతకు గురైన ప్రాంతాల ఉద్యోగులు ఈ విషయాన్ని గుర్తించారా, లేదా అని కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

దిగుబడి లేదు.. ధర రాదు..

- అధిక వర్షాలతో తగ్గిన పత్తి దిగుబడి
- ఎకరాకు గరిష్టంగా ఐదు క్వింటాళ్లు మించని దుస్థితి
- మరోపక్క సీసీఐ కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం
- ఫలితంగా నాణ్యత పేరుతో వ్యాపారుల ఇష్టారాజ్యం



అధిక వర్షాలతో పండుబారిన పత్తి పైరు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది పత్తి సాగు రైతుల ఆశలు గల్లంతయ్యాయి. అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావాన్ని చూపాయి. అరకొరగా పండిన పంట అమ్ముకుందామనుకున్నా దీనికి తోడు సీసీఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో ప్రైవేట్ వ్యాపారులు కనీస ధర చెల్లించడం లేదు. దీంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేక రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ప్రధాన పంటల్లో ఒకటి..

ఉమ్మడి జిల్లాలో సాగయ్యే పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 4,65,958 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మిర్చి ధరలో ఒడిదొడుకులు, సాగు భారం పెరగడంతో గత ఏడాదితో పోలిస్తే ఈసారి చాలా మంది పత్తి వైపు మొగ్గుచూపారు. దీంతో గత ఏడాది 4.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైతే ఈసారి మరో 15 వేల ఎకరాలు పెరిగింది. పంట సాగు విస్తీర్ణం ఆధారంగా 52 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినా.. అధిక వర్షాలతో అందులో సగం రావడమే కష్టమని చెబుతున్నారు.

దెబ్బతీసిన వర్షాలు

ఈ ఏడాది పత్తి పంటను వర్షాలు దెబ్బతీశాయి. సీజన్ ఆరంభం జూన్‌లో వర్షాలు సాధారణంగానే ఉన్నా జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో నమోదైన అధిక వర్షాలతో పత్తి పైర్లు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది జూన్‌లో 131.2 మి.మీ.ల వర్షపాతానికి గాను 123.9 మి.మీ.లే నమోదు నమోదు కావటంతో పత్తి సాగుకు అనుకూలించింది. కానీ జూలై నుంచి సెప్టెంబర్ వరకు సాధారణానికి మించి 30 శాతం మేర వర్షాలు కురవడడం గమనార్హం. ఈ మూడు నెలల్లోనే పత్తికి కీలక సమయం కావడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. పత్తి దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాళ్లు మించే పరిస్థితి లేదని.. ఇసుక పొర, ఎర్ర నేలల్లోనైతే 3–4 క్వింటాళ్లు దాటడం కష్టమేనని భావిస్తున్నారు.

ఆశించిన ధర లేక నష్టాలు

ఓ పక్క దిగుబడి పడిపోయి, అరకొరగానే వస్తున్న పత్తికి సైతం కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. ఎకరా పత్తి సాగుకు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెడతారు. కౌలు రైతులకు మరో రూ.20 వేలు అదనపు భారం ఉంటుంది. దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాళ్లు వేసినా నగటున రూ.6 వేలుగా లెక్కిస్తే రూ.30 వేలకు మించి ఆదాయం రాదు. కాగా, తేమశాతం ఆధారంగా కేంద్రం పత్తి క్వింటా ధర రూ. 8,110గా నిర్ణయించింది. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలు ఏర్పాటైతేనే రైతులకు ఈ ధర దక్కే అవకాశముంది. కానీ కేంద్రాల ఏర్పాటుతో ఆలస్యం జరుగుతుండగా వ్యాపారులు రూ.3వేలు నుంచి రూ.4వేల లోపే పత్తి కొనుగోలుకు యత్నిస్తున్నారు. ఫలితంగా రైతులు ఎనలేని నష్టం ఎదుర్కోక తప్పని పరిస్థితి. దీంతో నీరు సమృద్ధిగా ఉన్నందున పలువురు రైతులు పత్తి తొలగించి మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి

పూర్తిగా నష్టమే...

ఈ రైతు ముదిగొండ మండలం మల్లన్నపాలెంకు చెందిన యరదేశీ కోటయ్య. ఐదెకరాల కౌలు భూమిలో పత్తి సాగు చేయగా అధిక వర్షాలు దెబ్బతీశాయి. ఎకరాకు 4 – 5 క్వింటాళ్లు రాకపోగా మొదటి తీతలో పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పంటను ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తే తేమ, నాణ్యత పేరుతో కొంత పత్తికి రూ.4వేలు, ఇంకొంత రూ.5 వేల చొప్పున చెల్లించారు. ఇంకో పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి కౌలు ధర రూ.20 వేలకు తోడు ఇతర పెట్టుబడి కలిపితే ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35 వేల నష్టం వస్తుందని వాపోయాడు.

పత్తితో నష్టాల ఊబిలోకి..



మూడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశా. అధిక వర్షాలు దిగుబడిని దెబ్బతీశాయి. ఎకరాకు కౌలుతో కలిపి రూ.50 వేల వరకు పెట్టుబడి అయింది. కానీ దిగుబడి నాలుగు క్వింటాళ్లకు మించి రాదు. మొదటి తీతలో వచ్చిన పత్తిని రూ.6 వేల చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టం వచ్చింది. పత్తిని నమ్ముకుంటే అప్పులు తప్పడం లేదు.

– గోకినపల్లి భగత్, ఆరెంపుల, ఖమ్మం రూరల్ మండలం

క్లుప్తంగా

విద్యార్థి చదువుకు రూ.1.25లక్షల సాయం



ఆశ్రిత వర్షిణికి చెక్కు అందిస్తున్న రామారావు

కల్లూరు: ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి చదువు కోసం స్ఫూర్తి ఫౌండేషన్ బాధ్యులు గురువారం రూ.1.25లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజుగూడెంకు చెందిన మల్లికంటి సుధాకర్ – రజిని దంపతుల కుమార్తె ఆశ్రిత వర్షిణి కాకినాడలోని రంగరాయ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. వీరి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావను సంప్రదించారు. దీంతో ఆయన ఆయన చైర్మన్ శ్రీవ్యాల్‌తో మాట్లాడి ఎన్‌ఆర్‌ఐ, దాతల చేయూతతో మొదటి సంవత్సరం ఫీజుగా వర్షిణికి రూ.1.25 లక్షలు అందచేశారు.

మహిళా గురుకుల అధ్యాపకురాలికి డాక్టరేట్


కే.పీ.ఐశ్వర్య

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు కె.ప్రజ్ఞా ఐశ్వర్యకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'డిజైనింగ్ సప్లిమెంటరీ ఈఎస్‌ఎల్ కోర్సు బుక్ – టాస్క్ బేస్డ్ అప్రోచ్ ఫర్ యూజీ లెర్నర్స్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూషన్స్' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఐశ్వర్యను ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, అధ్యాపకులు ఏ.దీప్తి, బి.రాజేశ్వరి అభినందించారు.

కల్లూరు వాసి మానవతారాయ్‌కు...


మానవతారాయ్

కల్లూరు: 'హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం, సాహిత్యం' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కల్లూరుకు చెందిన కోటూరు మానవతారాయ్‌కు డాక్టరేట్ లభించింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు పర్యవేక్షణలో ఆయన పరిశోధనా పత్రం సమర్పించారు. మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడమే కాక ఓయూ న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు.

బాణసంచా అమ్మకాలపై ఘర్షణ

కొణిజర్ల: బాణసంచా అమ్మకం విషయంలో రెండు షాప్‌ల యజమానుల మధ్య ఘర్షణ జరగగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొణిజర్ల మండలం తనికెళ్ల శివారు శ్రీనివాస క్రాకర్స్‌లోకి సమీపాన ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని నాని క్రాకర్స్‌కు సంబంధించిన కొందరు ఇటీవల వచ్చారు. ధరలు ఎందుకు తగ్గించారని దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించడమే కాక తమ ఏరియాలో వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామని బెదిరించారు. దీంతో శ్రీనివాస క్రాకర్స్ సూపర్‌వైజర్ దాసరి వెంకట్రాములు ఫిర్యాదుతో నాని క్రాకర్స్ షాప్ బాధ్యులు లక్ష్మణరావు, రాహుల్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

ఉద్యోగి ఖాతాలోకి మున్సిపల్ నిధులు



వైరా మున్సిపాలిటీ కార్యాలయం

దారి మళ్లిన నగదు రూ.50లక్షలకు పైగానే..
- వైరా మున్సిపాలిటీలో బయటపడిన బాగోతం
- అయినా విచారణపై మీనమేషాలు

వైరా: వైరా మున్సిపాలిటీలో ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది బాధ్యతారాహిత్యం.. కొందరి అవినీతి కారణంగా రూ.లక్షల్లో నిధులు పక్కదారి పడుతున్నాయి. ఇరవై రోజుల క్రితం ఔట్ సోర్సింగ్ సిబ్బంది పన్నుల రూపంలో రూపంలో వసూలు చేసిన నగదును మున్సిపాలిటీ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి ఉపయోగించుకున్నారు. ఇదిలా ఉండగానే రెండు నెలల క్రితం మరో ఉద్యోగి మున్సిపల్ జనరల్ నిధులు రూ.50లక్షలకు పైగా సొంత ఖాతాలో జమ చేసుకున్న విషయం బయటపడడం గమనార్హం. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా ఉన్నతాధికారులు సిబ్బందిపై కనీస చర్యలు తీసుకోకపోవడంతోనే పునరావృతమవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

బయట పడిందిలా..

మున్సిపాలిటీలో అకౌంటెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ స్థానంలో విధులు నిర్వర్తించిన వార్డు ఆఫీసర్ తన ఖాతాకు రూ.లక్షల్లో నిధులు బదలాయించుకున్నా ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం. ఆతర్వాత ఆగస్టు 6వ తేదీన జూనియర్ అకౌంటెంట్‌గా కిరణ్ బాధ్యతలు స్వీకరించాడు. కానీ ఆయనకు అనుభవం లేదంటూ కొద్దినెలల తర్వాత బాధ్యతలు నిర్వర్తించాలని మున్సిపల్ కార్యాలయంలోని ఓ అధికారి సూచించినట్లు సమాచారం. ఇంతలోనే పాత కమిషనర్ వేణు బదిలీ కావడం, ఆ స్థానంలో గురులింగం విధుల్లో చేరగా రికార్డులు, ఖాతాలో పరిశీలించే సమయాన రూ.50లక్షలకు పైగా నిధులు పక్కదారి పట్టినట్లు తేలింది. దీంతో జూనియర్ అకౌంటెంట్ కిరణ్ ద్వారా పూర్తి రికార్డులు పరిశీలించాక కలెక్టర్‌కు నివేదించారు. మున్సిపాలిటీ నుంచి రూ.50లక్షలకు పైగా నిధులు పక్కదారి పట్టినా ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోకపోవడం, కనీసం ఫిర్యాదు అందకపోవడంతో ఉన్నతాధికారులే విస్మయం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గతంలోనూ ఇలాంటి సంఘటనలు

వైరా మున్సిపాలిటీకి పాలకవర్గం లేకపోవడం.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం వెరసి అక్రమాలకు అడ్డాగా మారిందనే ప్రచారం జరుగుతోంది. గతంలోనూ ఐట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతి బయటపడగా కొందరిని తొలగించారు. అయితే, రాజకీయ ఒత్తిళ్లతో మళ్లీ వారి విధుల్లోకి తీసుకోవడంతో పాటు బిల్ కలెక్టర్ విధులు అప్పగించడంతో అక్రమాలు షరా మామూలయ్యాయి. ఇటీవల వాణిజ్య సంస్థల నుంచి వసూలు చేసిన రూ.6లక్షల మేర పనులను కొందరు సొంతానికి వాడుకుని, విషయం బయటపడగానే ఖాతాలో జమ చేశారు. ఇది మరిచిపోకముందే ఉద్యోగి ఏకంగా రూ.50లక్షలకు పైగా తన పేరిట చెక్కులు రాసుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ యూ.గురులింగంను వివరణ కోరగా.. ఉద్యోగి సొంతంగా చెక్కులు రాసుకుని నగదు జమ చేసుకున్న అంశంపై తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై జూనియర్ అకౌంటెంట్ కిరణ్ ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చాడని చెప్పారు. పూర్తిస్థాయి ఆడిట్‌లో అన్ని అంశాలు వెల్లడవుతాయని తెలిపారు.

వ్యవహారం బయట పడిందిలా..

మున్సిపాలిటీ కమిషనర్ వేణు ఆగస్టు 22న బదిలీ అయ్యారు. అంతకుముందు జనరల్ ఫండ్ నుంచి మంజూరైన నిధులు ఖాతాలో ఉండగా.. వార్డు ఆఫీసరే అకౌంటెంట్ బాధ్యతలు నిర్వర్తించాడు. దీంతో ఆయన నచ్చిన వాళ్లకి చెక్కులు రాయడం, కార్యాలయంలో పనులు జరగకున్నా పనులు చేపట్టినట్లు సుమారు రూ.50లక్షల నుండి రూ.70 లక్షల మేర సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఈ విషయంలో నిబంధనల మాటేమో కానీ సదరు ఉద్యోగి పేరిటే చెక్కులు రాసి లెడ్జర్‌లోనూ నమోదు చేయలేదు. అంతేకాక తన ఖాతాలోకి నగదు బదలాయించుకుని వెంటవెంటనే డ్రా చేసినట్లు సమాచారం. సాధారణంగా మున్సిపల్ పరిధిలో ఏ పని చేసినా, ఏవైనా సామగ్రి కొన్నా సంస్థల పేరిటే చెక్కులు జారీ చేయాల్సి ఉంటుంది. అంతేకాక ప్రతీ చెక్కు ఎవరికి ఇచ్చారు, ఎంత నగదు, పని వివరాలను నమోదు చేయాలి. కానీ సదరు ఉద్యోగి తన పేరిట సుమారు 30 చెక్కులు రాసుకుని నగదును తన ఖాతాకు బదలాయించుకోవడం గమనార్హం. అయితే, ఇదంతా బదిలీ కమిషనర్‌కు తెలియకుండా జరిగే అవకాశం లేదని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

ఆయిల్‌ఫెడ్ అదుర్స్!


అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ప్లాట్‌ఫాంపై గెలలు(ఫైల్)

లక్ష్యానికి చేరువలో పామాయిల్ గెలల సేకరణ
- ప్రస్తుత ఆయిల్ సంవత్సరంలో టార్గెట్ 3 లక్షల టన్నులు
- ఈ నెల 7 నాటికే 2.95 లక్షల టన్నులు సేకరణ
- ఏటా గణనీయంగా పెరుగుతున్న ఓఈఆర్

దమ్మపేట: ఆయిల్ ఫెడ్ లక్ష్యానికి అతి చేరువలో ఉంది. మరో వారం రోజుల్లో టార్గెట్ పూర్తిచేసే అవకాశం ఉంది. ప్రస్తుత ఆయిల్ సంవత్సరంలో మూడు లక్షల టన్నుల పామాయిల్ గెలల సేకరణను ఆయిల్ ఫెడ్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నెల 7వ తేదీ వరకే 2.95 లక్షల టన్నులను సేకరించింది. రేటు అనేక ఎత్తుపల్లాలు చవిచూసినా ప్రస్తుతం టన్ను గెలల ధర రూ.19,400తో ఆశాజనకంగా ఉంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతాంగం స్థిర ఆదాయం ఇచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు ఆసక్తి చూపుతోంది. ఈ క్రమంలో ఏటా సాగు విస్తీర్ణంతోపాటు పంట దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతోంది. గెలల క్రషింగ్ కోసం యాజమాన్యం కూడా అదనపు ఫ్యాక్టరీలను నిర్మిస్తోంది. కాగా నవంబర్ 1 నుంచి అక్టోబర్ 31వరకు ఆయిల్ సంవత్సరంగా పేర్కొంటారు.

గణనీయంగా పెరుగుతున్న ఓఈఆర్

పామాయిల్ రికవరీ రేటు (ఓఈఆర్) ఏటా గణనీయంగా పెరుగుతోంది. దమ్మపేట మండలంలోని అప్పారావుపేటలో 2017లో ఏర్పాటుచేసిన అధునాతన ఫ్యాక్టరీతో ఓఈఆర్ పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. టీజీ ఆయిల్‌ఫెడ్ ద్వారా వచ్చిన ఆయిల్ రికవరీ రేటు శాతం ఆధారంగానే ఏపీలో ఉన్న ప్రైవేట్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఆయిల్‌పామ్‌కు ధరను ప్రకటించాల్సి వస్తుంది. ప్రస్తుతం ఆయిల్ రికవరీ రేటు 19.90 పైగా ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా, ఇదే జరిగితే ఆయిల్‌ఫెడ్ చరిత్రలోనే ఈ ఆయిల్ సంవత్సరపు ఓఈఆర్ అత్యధికం కానుంది.

అదనపు ఫ్యాక్టరీల నిర్మాణం

టీజీఎస్ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.22 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 లక్షల ఎకరాల్లో సాగు చేపడుతున్నారు. సుమారు 70 వేల ఎకరాల నుంచి గెలల దిగుబడి వస్తోంది. కొన్నేళ్లుగా సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో గెలల దిగుబడి కూడా ఏటా పెరుగుతోంది. దిగుబడికి అనుగుణంగా ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో అదనపు ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అప్పారావుపేట, అశ్వారావుపేటల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు ఉండగా, సిద్దిపేటలోని నర్మెట్ట ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేసుకుంది. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరుగూడెంలో ఫ్యాక్టరీ నిర్మాణం వడివడిగా కొనసాగుతోంది. గెలల దిగుబడి పెరగడంతో అశ్వారావుపేటలో మరో అదనపు ఫ్యాక్టరీని కూడా త్వరలోనే నిర్మించనున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సిద్దిపేట, నారాయణపేట, గద్వాల్, జనగాం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి తదితర ప్రాంతాల్లో సేకరణ కేంద్రాల ద్వారా గెలలను సేకరించి, లారీల్లో అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు.

దిగుబడి లక్ష్యాలు

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండటంతో దిగుబడి లక్ష్యాలు కూడా పెరుగుతున్నాయి. 2020–21లో ఆయిల్‌ఫెడ్ పామాయిల్ గెలల దిగుబడి లక్ష్యం 2 లక్షల టన్నులు కాగా 2024–25కు మూడు లక్షల టన్నులకు చేరుకుంది.

పామాయిల్ దిగుబడి, ఓఈఆర్ వివరాలు

ఆయిల్ (ఓఈఆర్ సంవత్సరం)	దిగుబడి లక్ష్యం (టన్నుల్లో)	దిగుబడి (టన్నుల్లో)	
2020-21	2,00,000	2,29,380	19.22
2021-22	2,25,000	2,64,520	19.32
2022-23	2,50,000	2,70,375	19.17
2023-24	2,75,000	2,27,110	19.42
2024-25	3,00,000	2,95,000	

అతి త్వరలోనే లక్ష్యసాధన



ప్రస్తుత ఆయిల్ సంవత్సరంలో నిర్దేశిత పామాయిల్ గెలల దిగుబడి లక్ష్యాన్ని అతి త్వరలోనే అధిగమించబోతున్నాం. ఆయిల్‌పామ్ తోటల సాగు విస్తీర్ణంతోపాటు గెలల దిగుబడి కూడా పెరిగింది. అత్యధిక ప్రమాణాలు కలిగిన ఆధునిక యంత్రాల ద్వారా క్రషింగ్ చేయడం ద్వారా ఆయిల్ రికవరీ రేటు శాతం గణనీయంగా పెరుగుతోంది.
– కల్యాణ్, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్

స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

చింతకాని: సీపీఐ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు సూచించారు. చింతకానిలో గురువారం జరిగిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, నాగిలిగొండ, నేరడ, కొదుమూరు, రామకృష్ణాపురం, ప్రొద్దుటూరు, చిన్నమండవ ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానంలో పోటీకి నాయకులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. జెడ్పీటీసీ అభ్యర్థిగా కొండపర్తి గోవిందరావును మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ప్రతిపాదించిందని తెలిపారు. సమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, కూచిపూడి రవి, దూసరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా నిలుద్దాం

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

ఖమ్మంవైద్యవిభాగం: సమాజంలో అన్ని వర్గాల ప్రజల నుంచి మానసిక దివ్యాంగులకు సహకారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ప్రపంచ మానసిక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానసిక దివ్యాంగులు బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తే మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలని, తద్వారా చికిత్స చేయించే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే, అవసరమైన వారికి ఉచితంగా న్యాయసాయం అందిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్, డాక్టర్ సౌమ్యా గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పంచనామా రాస్తున్న విజిలెన్స్ ఉద్యోగులు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లిలో 20వ నంబర్ రేషన్‌షాపులో అదనంగా ఉన్న 13.69 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. షాపులో స్టాక్ కంటే అదనంగా బియ్యం ఉన్నట్లు తేలగా డీలర్ ఏనుగుపాటి రామారావుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు, తహసీల్దార్ పులి సాంబశివుడు, గిర్దావర్ సుజాత పాల్గొన్నారు.

కాకరవాయిలో 22క్వింటాళ్లు..

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో అక్రమంగా నిల్వ చేసిన 22.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని తాటికొండ మనోజ్ ఇంట్లో బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించి మనోజ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఐఐ ఎక్స్‌పోలో 'ఎంఎస్‌ఆర్'కు గుర్తింపు



జ్ఞాపిక అందుకుంటున్న జయంత్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆధ్వర్యాన పాట్నాలో ఇటీవల నిర్వహించిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ ఎక్స్‌పోలో ఖమ్మంకు చెందిన ఎంఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మొగిలి జయంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిహార్‌లో మౌలిక సదుపాయాలు, పట్టణ గృహాభివృద్ధికి అత్యుత్తమ సహకారం అందించడంపై ఎంఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌ను గుర్తించిన సీఐఐ బాధ్యులు జయంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఐఐ గుర్తింపు తమకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. ఈ అవార్డు తమ బృందం అంకితభావం, నాణ్యత, ప్రాజెక్టుల రూపకల్పనలో చిత్తశుద్ధిగా నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ ప్రభుత్వ ప్రతినిధులు, వివిధ పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీ.టీ. ర్యాంకింగ్ టోర్నీ

- ఖమ్మం చేరుకున్న పది జిల్లాల జట్లు
- ఇండోర్ స్టేడియంలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు


స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో నూతనంగా నిర్మించిన హాల్‌లో శుక్రవారం నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ జరగనుంది. బాలసాని సన్యాసయ్య స్మారక రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి క్రీడాకారులు ఖమ్మం చేరుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలు అండర్–11 నుంచి సీనియర్స్ వరకు బాలబాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో జరుగుతాయి.

ర్యాంకింగ్ క్రీడాకారులు వచ్చారు..



టేబుల్ టెన్నిస్ పోటీలకు హైదరాబాద్, రంగారెడ్డి, తదితర జిల్లాలే నుంచే కాక ఉమ్మడి ఖమ్మం నుంచి ర్యాంకింగ్ క్రీడాకారులు వచ్చారు. ఇక్కడ ప్రతిభ చూపేవారిని మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తాం. క్రీడాకారులకు ఇబ్బందులు ఎదురుకాకుండా టోర్నీ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం.
– వి.సాంబమూర్తి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ఉత్తమ ర్యాంక్ సాధిస్తా..



ఇప్పటివరకు ఐదు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. అండర్–13 బాలికల సింగిల్స్‌లో తీవ్రమైన పోటీ ఉంది. అయినా సత్తా చాటి మెరుగైన ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాను. మా గ్రూప్‌లో అంతా మంచి క్రీడాకారులు ఉన్నారు.
– బి.సాయిశివాని, ఖమ్మం

నా ర్యాంకు నిలబెట్టుకుంటా..



రాష్ట్రస్థాయి అండర్–11 కేటగిరీలో సింగిల్స్‌లో మొదటి స్థానాన ఉన్నాను. ఇక్కడి టోర్నీలో సత్తా చాటి నా ర్యాంకు నిలబెట్టుకుంటా. మా అమ్మానాన్నలు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. వారి ఆశయాలకు అనుగుణంగానే ర్యాంక్ సాధిస్తా.
– అద్విక్, హైదరాబాద్

నాలుగేళ్లుగా సాధన



ప్రభుత్వ పాఠశాలలో చదివే సమయాన ఉచిత శిక్షణ ఇస్తున్నారని తెలిసి నాన్న నాలుగేళ్లుగా స్టేడియంకు తీసుకొస్తున్నారు. ఇప్పటికి కోచ్ ఉచితంగానే శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.
– జి.సిరి, ఖమ్మం

ఇంకొన్నాళ్లు పక్కకే..!



జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ గురువారం విడుదల కావడంతో ఆశావహులంతా అటు నామినేషన్ వేయగానే.. ఇటు ప్రచారం మొదలుపెట్టాలని భావించారు. ఈమేరకు ప్రచారం కొందరు ప్రత్యేక వాహనాలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ అభ్యర్థికి సంబంధించి వాహనం పరుగులు తీయగా.. కోర్టు స్టేతో ఈ వాహనాన్ని మరికొద్ది రోజులు పక్కన పెట్టక తప్పని పరిస్థితి ఎదురైంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

తపాలా వ్యాపార లావాదేవీలు పెరగాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలో తపాలా వ్యాపార లావాదేవీలను మరింతగా పెంచాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్ర స్వామి సూచించారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఖమ్మంలో శాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సేవింగ్ ఖాతాలు, జీవిత బీమా, డిపాజిట్ల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేసి లక్ష్యాలను నిర్దేశించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, పోస్టుమాస్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి


తిరుమలాయపాలెం: వ్యవసాయ బావి పక్కన పశువులకు గడ్డి కోసే క్రమాన ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళ మృతి చెందింది. మండలంలోని పిండిప్రోలుకు చెందిన కాంపాటి ఆశాకుమారి(33) భర్త నాగేశ్వరరావుతో కలిసి గురువారం పంట చేను వద్దకు వెళ్లింది. ఆతర్వాత నాగేశ్వరరావు తిరుమలాయపాలెం వెళ్లగా, ఆశాకుమారి బావి పక్కన గడ్డి కోస్తూ కాలు జారి బావిలో పడింది. కాసేపటికి వచ్చిన నాగేశ్వరరావు ఆమె బావిలో పడ్డట్టు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కిరాణా దుకాణంలో చోరీ

వైరా: వైరా పాత బస్టాండ్ సమీపాన గాంధీ చౌక్‌లోని తెల్లాకుల సందీప్ కిరాణ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం షాపు తెరవడానికి సందీప్ రాగా, షాప్‌లో సీసీ కెమెరాలు పగలగొట్టి ఉండడం, వస్తువులన్నీ చిందర వందరగా పడేసి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. షాప్ నుంచి రూ.30వేల నగదు చోరీకి గురైందని సందీప్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకంపై రూ.81వేల జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కస్బా బజార్, కమాన్ బజార్, అజీజ్ గల్లీ ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న, ఉపయోగిస్తున్న దుకాణదారులకు రూ.81,500 జరిమానా విధించారు. అలాగే, 70 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రతీఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి, ప్రత్యామ్నాయాలు ఎంచుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్చుకుందాం

ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పదమూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లల్లో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టలూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

> కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.















ఫ్యాషన్

● ఇయర్ చెయిన్స్

మెరిసే సరాలు

రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు
లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు
మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న
ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్
సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం
నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా
నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో
తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా
ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్,
ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.

సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు–జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ సెలబ్రిటీల స్టైల్ టచ్

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వికపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.



కేర్‌గివర్

రాణి అనే నేను ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...

ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మనసు మాట విందాం!

మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ–పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

> ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80–డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతోపాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	1,26,250	1,24,150	1,26,250.	1,28,000	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	1,13,380	1,13,800	1,17,210	1,17,700	1,14,000
వెండి	1,70,000	1,58,600	1,67,000	1,58,600	1,60,000	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.